# శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం

## అప్పలాయగుంట


రచన

**జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**

**తిరుపతి**



ప్రచురణ

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

**2014**

**SRI PRASANNA VENKATESWARASWAMI ALAYAM - APPALAYAGUNTA**

*by*

**Julakanti Balasubrahmanyam**

T.T.D. Religious Publications Series No. 1017
© All Rights Reserved

First Edition : 2013
Re-print : 2014

No. Copies : 3000

*Published by:*
**M.G. GOPAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Editor in Chief Office,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

వేంకటశైలనాయకుడైన శ్రీనివాస పరంధామునికి అత్యంత ప్రియమైన దివ్యప్రదేశాలు రెండు ఉన్నాయి.

ఒకటేమో సాక్షాత్తు శ్రీవైకుంఠం! ఇక రెండవది భూలోకవైకుంఠమైన వేంకటాచల క్షేత్రం!

తనకు ఇష్టమైన వేళల్లో వైకుంఠాన్ని విడిచి, దానికంటె ఉత్తమమైన వేంకటాచలక్షేత్రంలో శ్రీమహాలక్ష్మీ భూమహాలక్ష్మీ ఉభయదేవేరులతో లీలా మానుషవిగ్రహుడై విహరిస్తాడట శ్రీనివాసభగవానుడు. అనగా శ్రీవైకుంఠం ఎంత ప్రాచీనమో ఏనాటిదో, భూలోక వైకుంఠం కూడ అంతటి ప్రాచీనమే గాక అంతటి ప్రాధాన్యతను, మహిమను సంతరించుకొన్నదని కూడ చెప్పవచ్చు.

కలియుగంలో 'కలౌ వేంకటనాయకః' అన్న పెద్ద బిరుదుతో ఈ శ్రీనివాసుడు సాక్షాత్తుగా నడయాడిన, తిరుమల క్షేత్రంతోపాటు, అనేక పవిత్ర పుణ్యస్థలాలు ఈ 'సప్తగిరుల' సానువుల్లో అనేకం వున్నాయి.

వాటిలో 'తిరుమల' తర్వాత పేర్కొనదగింది 'నారాయణవరం'. దీన్నే 'నారాయణవనం' అనీ, 'నారాయణపురం' అని కూడా అంటారు. సాక్షాత్తు శ్రీనివాసుడు ఆకాశరాజు కూతురు పద్మావతిని పరిణయమాడి శ్రీకల్యాణ వేంకటేశ్వరునిగా దర్శనమిస్తున్న దివ్యక్షేత్రం నారాయణవనం.

ఆ తర్వాత పేర్కొనదగిన పుణ్యక్షేత్రం శ్రీనివాసమంగాపురం. నూతన దంపతులైన శ్రీపద్మావతీశ్రీనివాసులు, స్వర్ణముఖీతీరంలోని అగస్త్యాది మహర్షుల కెందరికో దర్శనమిస్తూ సుమారు ఆరు నెలలపాటు విడిది చేసి కల్యాణవేంకటేశ్వరుడిగా మరెందరినో తరింపచేసిన దివ్యక్షేత్రం శ్రీనివాసమంగాపురం.

ఆ కల్యాణదంపతులు చుట్టుపక్కల విహరిస్తూ, స్వర్ణముఖీనదికి దక్షిణతీరంలో వున్న యోగులకొండలో సిద్ధులయ్య అనే యోగికి ప్రసన్నుడై దర్శనమిచ్చిన పుణ్యక్షేత్రం అప్పలాయగుంట. ఇక్కడ శ్రీ ప్రసన్న వేంకటాచలపతిగా దర్శనమిస్తూ అందరికోరికలను ప్రసన్నంగా తీరుస్తున్నాడు.

ఆ తర్వాత సాక్షాత్తు శ్రీనివాసుడు శ్రీమహాలక్ష్మి అనుగ్రహంకోసం 12 ఏండ్లపాటు తపస్సు చేసి ప్రత్యక్షం చేసికొన్న మహా మహిమాన్వితమైన క్షేత్రం తిరుచానూరు.

ఇలాంటి దివ్యక్షేత్రాల మహిమాన్వితమైన చరిత్రలతోపాటు ప్రస్తుతం అప్పలాయగుంటలోని శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారి ఆలయ విశేషాలను "శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయం - అప్పలాయగుంట" పేరుతో పుస్తకంగా అందజేసిన శ్రీజూలకంటి బాలసుబ్రహ్మణ్యం గారికి ఆనంద నిలయుని అనుగ్రహం నిండుగా వుండాలని ప్రార్థిస్తున్నాను.

భక్తులందరూ తి.తి.దేవస్థానం వారి ధార్మిక ప్రచురణగా వెలువడిన ఈ పుస్తకాన్ని ఆకళింపు చేసుకొని అప్పలాయగుంట శ్రీప్రసన్నవేంకటేశ్వరుని అనుగ్రహాన్ని సంపూర్ణంగా పొందగలరని ఆకాంక్షిస్తూ...

*సదా శ్రీవారి సేవలో....*

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# కృతజ్ఞతాంజలి

రెండేండ్లుగా, అంటే 2011 వ సంవత్సరం నుండి తిరుమల తిరుపతి దేవస్థానం పర్యవేక్షణలోని దేవాలయాల చరిత్రల్లో ఒక సువర్ణాధ్యాయం ప్రారంభమైంది.

దేవస్థానం ఆ యా ఆలయాలను అభివృద్ధి పరచడంలోను, బ్రహ్మోత్సవం వంటి విశేషోత్సవాలను వినూత్నంగా నిర్వహించడంలోను, ఆ ఉత్సవాల్లో నూతన వస్త్రసమర్పణ, పుష్పమాలాసమర్పణవంటి కార్యక్రమాల్లోను సామాన్య భక్తులందరూ పాలుపంచుకొనేట్లుగా వీలు కల్పించడంవంటి నిర్ణయాలు గైకొనడంలోను, ఆ యా బ్రహ్మోత్సవాల్లో యాత్రికులకు ధారాళంగా అన్న ప్రసాద వితరణ చేయించడంలోను తిరుమల శ్రీవారి ప్రతినిధులైన దేవస్థాన అధికారవరేణ్యులందరు అమలు చేస్తున్న చర్యలు చాలగొప్పవి. అవి భక్తులపాలిటి వరాలు.

అంతమాత్రమే గాక ఆ యా ఆలయాల చరిత్రలను స్థలపురాణాలను, ఉత్సవవిశేషాలను వీలైనంత సంక్షిప్తంగా భక్తులకు అందజేయాలన్న సంకల్పంతో, తి.తి.దేవస్థానం అప్పలాయగుంట 'శ్రీప్రసన్నవేంకటేశ్వర స్వామి' ఆలయాన్ని గూర్చి నన్ను వ్రాయమని ఆదేశించడం తిరుమలేశుని అనుగ్రహంగా భావిస్తున్నాను. ప్రస్తుతం అప్పలాయగుంట 'శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి' వారి ఆలయం స్థలపురాణాన్ని, ఆలయ విశేషాలను పుస్తకరూపంలో అందజేయడం నా మహద్భాగ్యం. నా యీ రచనలో ఎన్నో విషయాల్ని తెలిపిన అప్పలాయగుంట 'శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి' ఆలయ అర్చకవరేణ్యులయిన సర్వశ్రీ తమిరిశ సూర్యకుమారాచార్యులు, కందుకూరి రమేష్ ఆచార్యులు, అర్చకం మాధవగిరి రమణాచార్యులు, అర్చకం మాధవగిరి నరసింహాచార్యులు - వీరందరికి భక్తిపూర్వక నమస్కారాలు.

నా యీా రచనలు అన్నింటికీ కర్తా, కారయితా భగవానుడైన తిరుమల వేంకటేశ్వరుడు! కాగా, ప్రేరకులు, ఆమోదకులు మాత్రం శ్రీనివాసుని పరమభక్తులు. తి.తి.దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీకనుమూరి బాపిరాజుగారు, నిరంతర భక్తజన సేవా తత్పరులు, సంగీత సాహిత్యజ్ఞులు, సహృదయులైన తి.తి.దేవస్థానం శ్రీ కార్యనిర్వహణాధికారి శ్రీ.ఎల్.వి. సుబ్రహ్మణ్యంగారు, సంగీత సాహిత్యా భిలాషులు, భక్తజనసేవాతత్పరులు తిరుపతి, తిరుమల సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ.పి.వెంకటరామి రెడ్డిగారు, శ్రీ కె.ఎస్.శ్రీనివాస రాజు గారలు. వారందరికీ భక్తిపూర్వక ప్రణామాంజలులు.

ఈ రచనలు చెయ్యడానికి వెన్నుతట్టి ఉత్సాహపరుస్తున్న తి.తి.దేవస్థానం ఎడిటర్–ఇన్–ఛీఫ్ ఆచార్య రవ్వా శ్రీహరి గారికి, పుస్తకముద్రణలో ప్రత్యేక శ్రద్ధ చూపించిన దేవస్థానం పి.ఆర్.ఓ. శ్రీ టి.రవి గారికి, పుస్తకాన్ని ముచ్చటైన రంగుల అట్టతో చూడసొంపుగా ముద్రించిన దేవస్థానం ప్రెస్సు మేనేజరు శ్రీ వి.సాంబశివరావు గారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు.

తి.తి.దేవస్థానంలోని ఇతర ఆలయాల చరిత్రరచనలు కూడ ఘనవేంకటేశుని అనుగ్రహంతో, సహృదయులైన అధికారుల ప్రోత్సాహంతో కొనసాగగలవని ఆకాంక్షిస్తున్నాను.

**ఓం నమో వేంకటేశాయ**

**రచయిత**
**జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**
**తిరుపతి.**

# విషయసూచిక


| | |
|---|---|
| ముందుమాట | iii |
| కృతజ్ఞతాంజలి | v |
| శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయం | 1 |
| స్థలపురాణం | 3 |
| శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయం | 3 |
| అగస్త్యుడి ఆతిథ్యం | 5 |
| యోగులకొండ | 8 |
| వింత వింత జనశ్రుతులు | 10 |
| అప్పులయ్య కథ | 10 |
| అప్పులేని గుంట | 11 |
| చారిత్రక కథనాలు | 12 |
| తి.తి.దేవస్థానంలో విలీనం | 24 |
| శ్రీప్రసన్న వేంకటేశ్వరాలయం – అప్పలాయగుంట | 25 |
| శ్రీప్రసన్న ఆంజనేయస్వామి సన్నిధి! | 25 |
| పుష్కరిణి | 27 |
| మహాద్వార రాజగోపురం | 27 |
| బలిపీఠం – ధ్వజస్తంభం | 28 |

| | |
|---|---|
| వంటశాల | 28 |
| గరుడమందిరం | 28 |
| శ్రీపద్మావతి అమ్మవారి సన్నిధి | 29 |
| శ్రీగోదాదేవి సన్నిధి | 31 |
| ముఖమండపం | 32 |
| ద్వారపాలకులు | 32 |
| అంతరాళం | 32 |
| గర్భాలయం | 33 |
| శ్రీవారి మూలమూర్తి | 33 |
| ఉత్సవమూర్తులు | 35 |
| ఉత్సవాలు | 37 |
| నిత్యోత్సవాలు | 37 |
| వారోత్సవాలు | 38 |
| పక్షోత్సవాలు | 39 |
| మాసోత్సవాలు | 39 |
| వార్షికోత్సవాలు | 41 |
| సమర్పణ | 48 |

# శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయం
# అప్పలాయగుంట

**శ్లో॥ స్మరణాత్ సర్వపాపఘ్నం**
**స్తవనాదిష్టవర్షిణమ్**
**దర్శనాన్ముక్తిదం చేశం**
**శ్రీనివాసం భజేఽ_నిశమ్**

ఆ స్వామివారిని స్మరిస్తే చాలు! ఇట్టే పాపాలు అన్నీ నశిస్తాయి. ఆ దేవుణ్ణి కీర్తిస్తే చాలు!! కోరిన కోరికలన్నీ తీరతాయి. ఆ దేవదేవుణ్ణి కన్నులారా దర్శిస్తే చాలు!!! అంతమాత్రం చేతనే ముక్తి కలుగుతుంది. మోక్షం సిద్ధిస్తుంది. ఇలాంటి మహిమాన్వితమైన శ్రీనివాస భగవానుణ్ణి నిత్యమూ భజిస్తాను.

ఇలా భక్తులందరిచేత నిరంతరం కీర్తింపబడుతూ భక్తులపాలిటి కొంగుబంగారమై వెలుగుతున్న తెలుగువారి ఇలవేలుపు, ఇలువేలుపు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి.

శ్రీవైకుంఠంనుండి నేరుగా భువికి దిగివచ్చి లీలా మానుషరూపంలో సంచరించిన తొలినాళ్లలో, శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రత్యక్షంగా అనుబంధ మున్న అనేక దివ్యస్థలాలు సప్తగిరుల సానువుల్లో చాలానే వున్నాయి.

అందులో ఆకాశరాజు రాజధాని **నారాయణవనం** మొదటిది. అక్కడ ఆ దివ్యస్థలంలో శ్రీవేంకటేశ్వరుడు నూనూగుమీసాలనూతనయవ్వనంతో కల్యాణకంకణంతో పద్మావతిఅమ్మవారిని పరిణయం చేసికొనే పెండ్లి కుమారునిగా, కల్యాణ వేంకటేశ్వరునిగా దర్శనమిస్తున్నాడు.

ఆకాశరాజు పుత్రిక పద్మావతిని వివాహమాడిన అనంతరం పసుపుబట్టలతోనే వేంకటాచలక్షేత్రానికి వెళుతూ దారిలో అగస్త్యాశ్రమంలో విడిది చేశారు పద్మావతీశ్రీనివాసులు. సుమారు ఆరునెలలపాటు ఆ కల్యాణదంపతులు విహరించిన దివ్య ప్రదేశం **శ్రీనివాసమంగాపురం.** ఇక్కడ ఆ స్వామి కల్యాణవేంకటేశ్వరునిగా భక్తులకు వరాలను గుప్పిస్తున్నాడు. ఇది రెండవ పుణ్యస్థలం!

ఆ తర్వాత ఇంచుమించుగా ఇదే సమయంలో పద్మావతితో విహరిస్తున్న వేంకటేశ్వరుడు, తిరుమలక్షేత్రానికి ఆగ్నేయమూలలో వున్న యోగుల కొండకు క్రింది భాగంలో శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామిగా వెలసివున్నాడు. ఆ క్షేత్రమే అప్పలాయిగుంట! ఇది మూడవ దివ్యస్థలం.

**"వేవేలు చేంతలవాఁడు వీఁడె వీఁడె**
**దేవుఁడు గదె ప్రసన్న తిరువెంగళప్పుఁడు"**

అన్నట్లుగా అప్పలాయగుంటలో వేవేల చేతలతో అనగా భక్తులకు అనేక కార్యాలను నెరవేరుస్తున్న శ్రీప్రసన్న వేంకటేశ్వరుడు అభయముద్ర భంగిమలో భక్తులకు దర్శనమిస్తుండడం చాల విశేషం!

దక్షిణాన ఎత్తైన యోగులకొండ, ఉత్తరం దిక్కున ఈశాన్యమూలన మరొకవైపు అద్దంలా మిలమిలా మెరుస్తున్న విశాలమైన నీటిగుంట, ఆ గుంట చుట్టూరా, పచ్చని పంటపొలాలు. ఇలా వీటన్నిటి మధ్యలో దివ్య ప్రశాంత ధామంగా ప్రకాశిస్తున్న క్షేత్రం శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయం. ఈ దేవాలయం వల్ల అప్పలాయగుంటకు ఒక విశిష్టత చేకూరడమేగాక తిరుమల క్షేత్రానికీ, ఈ పుణ్యస్థలానికి విడదీయరాని విడదీయలేని ఒక ఆధ్యాత్మిక అనుబంధం, సంబంధం పెనవేసుకుందన్న భావం తోపకమానదు.



తిరుపతి పట్టణానికి సుమారు 18 కిలోమీటర్ల దూరంలో ఆగ్నేయ దిక్కుగా, అనగా తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి పావనక్షేత్రం అయిన తిరుచానూరుకు దక్షిణదిక్కున 10 కిలోమీటర్ల దూరంలో వెలసివున్న దివ్యక్షేత్రం అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి దివ్యసన్నిధి!

తిరుపతినుంచి ప్రతిరోజు ఉదయం 5 గం॥ల నుంచి గంట గంటకు అప్పలాయగుంటకు ఆర్.టి.సి. వారి బస్సులు నడుపబడుతున్నవి. పుత్తూరు నుంచి కూడ ఇక్కడికి నేరుగా బస్సులు ఉన్నాయి. తిరుచానూరు నుంచి ఆటోల్లో కూడ ఈ క్షేత్రానికి సులభంగా వెళ్లవచ్చు.

## స్థల పురాణం

అత్యంతప్రాచీనమైన అప్పలాయగుంట గ్రామానికీ, ఆ ఊళ్లో వెలసిన శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారికి ఒక అద్భుతమైన, ఆసక్తికరమైన స్థలపురాణం చోటుచేసుకుంది.

చాలకాలం క్రిందట జరిగిన గాథ! సాక్షాత్తుగా తిరుమల శ్రీనివాసునితో పెనవేసుకొన్న ఆనందకరమైన వృత్తాంతం ఇది.

## శ్రీపద్మావతీశ్రీనివాసుల పరిణయం

భృగుమహర్షి పరీక్షవల్ల కోపంతో అలిగి వైకుంఠాన్ని వీడిన శ్రీమహాలక్ష్మి భూలోకంలో కొల్హాపురక్షేత్రం (మహారాష్ట్ర) చేరింది. ఆమె వెనుకనే వైకుంఠం నుండి శ్రీనివాసుడు లక్ష్మిని వెదుకుతూ భూలోకం చేరుకున్నాడు. ఆమెకోసం వెదకి వెదకి వేసారి పోయి చివరకు ఆదివరాహక్షేత్రం చేరుకొన్న శ్రీనివాసుడు పుట్టలో తలదాచుకున్నాడు. ఆకలిదప్పుల బాధలకు లోనయ్యాడు.

హిరణ్యాక్షుని వధించిన శ్వేతవరాహస్వామివారి అనుగ్రహంతో వకుళమాత (ద్వాపరయుగంనాటి యశోదామాత) సేవలవల్ల ఊరట చెందుతాడు శ్రీనివాసుడు.

తరువాత వేటకు వెళ్లిన శ్రీనివాసుడు శేషాచలం అడవుల్లో ఏనుగుబారిన పడిన ఆకాశరాజు కూతురు పద్మావతిని రక్షించి, ఆమె మోహంలో పడతాడు. పద్మావతి లేనిదే తాను బతకలేనని భీష్మిస్తాడు శ్రీనివాసుడు.

ఆకాశరాజు కూతురు పద్మావతి ఎక్కడ? అరణ్యాల్లో ఆకు లలముల్ని దుంపల్ని ఆరగించే మనమెక్కడ? అని సందేహించిన వకుళమాతతో ఇలా వివరిస్తాడు శ్రీనివాసుడు.

అమ్మా! పూర్వజన్మలో సీతకోసం లంకకు వెళ్లిన వేదవతే, ఇప్పుడు ఆకాశరాజు కూతురు పద్మావతిగా అవతరించింది. ఆనాడు నేనిచ్చిన వరం వల్ల ఆమెను పరిణయమాడి తీరాలి, తప్పదు. అన్నాడు శ్రీనివాసుడు.

అలాగా! అని ఆశ్చర్యపోయిన వకుళమాలిక పెళ్లికోసం రాయబారాన్ని నెరపింది. దానితో పాటు నారదమహర్షి ఆకాశరాజుకు చేసిన ఉపదేశం వల్లా, ఎరుకలసానిగా శ్రీనివాసుడు ఎరుక చెప్పడంవల్లా, పద్మావతీ శ్రీనివాసుల పరిణయం నిశ్చయింపబడింది.

ఆకాశరాజు రాజధాని నారాయణవనంలో, వైశాఖశుక్లపక్షం దశమీ శుక్రవారం పూర్వఫల్గునీ నక్షత్ర శుభముహూర్తంలో ముక్కోటి దేవతల సాక్షిగా పద్మావతీశ్రీనివాసుల పరిణయం అంగరంగవైభవంగా నిర్వహింపబడింది.

వివాహానంతరం పసుపు బట్టలతో పద్మావతీశ్రీనివాసులిరువురూ వరాహక్షేత్రానికి బయలుదేరారు.



## అగస్త్యుడి ఆతిథ్యం

ఆ దారిలో వెళుతూ వాళ్లిద్దరూ సువర్ణముఖీ–కల్యాణీ–భీమానదుల త్రివేణీ సంగమంలో వెలసివున్న శ్రీఆనందవల్లీ సమేత శ్రీఅగస్త్యేశ్వరక్షేత్రాన్ని, పక్కనేవున్న అగస్త్యమహాముని ఆశ్రమాన్ని సందర్శించారు.

తన ఆశ్రమవాటికను పరమ పావనం చేసిన జగత్కల్యాణ మూర్తులైన శ్రీపద్మావతీశ్రీనివాసదంపతు లిరువురికీ భక్తిపూర్వకమైన స్వాగతాన్ని, సంతృప్తికరమైన ఆతిథ్యాన్ని ఇచ్చాడు అగస్త్యమహాముని.

ఆ తర్వాత, నారాయణవనంలో జరిగిన పెళ్లి వేడుకలను ముచ్చటిస్తూ, ఆకాశరాజు అద్భుతంగా ఘనంగా వివాహతంతును జరిపించాడు. ఆ పెళ్లిలో మరవరాని, మరచిపోలేని ఏర్పాట్లతోపాటు కమ్మని విందుభోజనాలు వడ్డింపులు వర్ణించడానికి ఎవరితరం కాదు. అంటూ అయినా కొత్త పెండ్లికొడుకువు! అత్తవారింట్లో మరికొన్నాళ్లు వుండవచ్చు కదా శ్రీనివాసా! అన్నాడు అగస్త్యమునీంద్రుడు.

మునీంద్రా! మీరన్నది నిజమే! కాని అత్తవారింట్లో ఎక్కువ రోజులు వుండడం ఎంతవరకు సబబు? అయినా ఊరూ పేరూ లేనివాణ్ణి! పైగా పెళ్లికూడా చేసుకొని మరింత బరువు బాధ్యతలు పెంచుకున్నాను. విధిలిఖితం ఎవరు తప్పించగలరు మహర్షీ! వరాహక్షేత్రం వెళ్లి నివాసయోగ్యమైన భవనాన్ని నిర్మించుకొని ఆ వరాహక్షేత్రంమీదే వుండాలని నా సంకల్పం. ఆ క్షేత్రానికి వెళ్తూ దారిలో తమ దర్శనం చేసుకోవడం, మా దంపతుల మహద్భాగ్యంగా భావిస్తున్నాం. అంతేగాక

బహుదొడ్డత్యాగంతో లోకకల్యాణంకోసం దక్షిణదేశానికి తరలివచ్చిన తమరు మాకు హితంగా, సన్నిహితంగా తపోవనాన్ని ఏర్పాటు చేసుకోవడం

మా పుణ్యఫలాన్ని ఎంత చెప్పుకొన్నా తక్కువే అవుతుంది. ఎందుచేతంటే ఈ ఆశ్రమప్రాంతం అంతటా అడుగడుగునా అణువణువునా అద్భుతమైన అనిర్వచనీయమైన ఆధ్యాత్మికచైతన్యం ఉట్టిపడుతున్నది. మీ తపశ్శక్తి అమోఘం! జగత్కల్యాణకారకం! మహర్షీ! మేం వెళ్లివస్తాం. మాకు సెలవా మరి! అన్నాడు శ్రీనివాసుడు.

"స్వామీ! శ్రీనివాస పరంధామా! మాదొక విజ్ఞాపనం! మా ఈ అభ్యర్థన. మీకు తెలియని విషయం ఏమాత్రం కాదు. నెలకూడ దాటని నూతన కల్యాణదంపతులు మీరు. తీర్థయాత్ర గాని, పుణ్యక్షేత్రసందర్శనం గాని చెయ్యకూడదు. అది శాస్త్రనిషిద్ధం! అందువల్ల మీరు వరాహక్షేత్రప్రయాణాన్ని విరమించుకొని ఒక ఆరునెలలపాటు ఆశ్రమవాటికలో విడిది చెయ్యండి. మా ఆతిథ్యాన్ని స్వీకరించండి!

అందువల్ల కూడ, జగత్కల్యాణదంపతులైన మీ ఇరువురి దివ్య పాదపద్మాలు సోకిన మా తపోభూమి పరమపావన మవుతుంది. తాము నడయాడే ఈ సువర్ణముఖీ నదీ పరివాహక ప్రాంతాలు అన్నీ పవిత్రమైన దివ్యస్థలాలుగా విరాజిల్లుతూ ఇష్టార్థాలను ప్రసాదిస్తాయి." అంటూ అగస్త్యమహర్షి అనేకవిధాల ప్రార్థించాడు.

అవశ్యం మహర్షీ! లోకకల్యాణకారకమైన తమ అభ్యర్థన మాకు శిరోధార్యం! జవదాటరానిది కూడ. అంతేకాక ఈ కలికాలంలో భక్తులే మాకు పరమావధి! ప్రధానంగా భక్త సంరక్షణమే మా ఈ అవతార లక్ష్యం కూడ.

అందువల్ల మీ అభ్యర్థన మాకు ఆనందదాయకం! అంటూ వెంటనే శ్రీనివాసుడు తొండమాను చక్రవర్తిని పిలిచాడు.



చక్రవర్తీ! మేము ఒక ఆరునెలలపాటు ఈ అగస్త్యాశ్రమ ప్రాంతంలో ఉండదలిచాం. అందువల్ల వేంకటాచలక్షేత్రంలో పుష్కరిణికి దక్షిణం దిక్కున వరాహస్వామి దానమిచ్చిన నూరు అడుగులమేర స్థలంలో శాస్త్రోక్తంగా మాకోసం ఒక దివ్యభవనాన్ని నిర్మించు. కల్యాణ దంపతులమైన మేము అందులో గృహప్రవేశం చేస్తాం. పోయిరా అన్నాడు శ్రీనివాసుడు.

చిత్తం! అంటూ తొండమానుడు వరాహక్షేత్రానికి వెళ్లాడు.

ధన్యాతిధన్యులం శ్రీనివాసప్రభూ! కల్యాణ దంపతులైన మీరు మా కోరికను మన్నించడం మా భాగ్యం. మీ ఇరువురికోసం ఒక కుటీరాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయిస్తాం. ఈ ఆశ్రమంలో మీ అభీష్టానుసారం స్వేచ్ఛగా, ఆనందంగా విహరించండి! అంటూ నమస్కరించారు అగస్త్యముని దంపతులు.

అగస్త్యుడు సకల ఏర్పాట్లుతో అమర్చిన అందమైన కుటీరంలో ఆరునెలలపాటు పద్మావతీశ్రీనివాసులు ఆనందంగా సుఖంగా కాపురం చేశారు. పక్కనే ప్రవహిస్తున్న సువర్ణముఖీనదిలో జలక్రీడలాడారు. కుంభసంభవుడు ప్రతిష్ఠించిన శ్రీఆనందవల్లీ సమేత శ్రీ అగస్త్యేశ్వరుణ్ణి సేవించుకున్నారు. అక్కడ తోటల్లో విహరించారు. మునివాటికలను సందర్శించారు. అక్కడికి దగ్గర్లోనే ఆగ్నేయ దిక్కున వున్న తాతామనవళ్ల ఆశ్రమాలు–శుకమహర్షి ఆశ్రమాన్ని (శ్రీశుకపురం–తిరుచానూరు), పరాశరమహర్షి ఆశ్రమాన్ని (యోగిమల్లవరం) సందర్శించారు. అక్కడికి దగ్గర్లోని యోగులకొండల్లోని యోగులకు దర్శనమిచ్చారు.

* * *

## యోగులకొండ

శ్రీ శుకమహర్షి ఆశ్రమానికి దక్షిణ దిక్కుగా వున్న కొండ, యోగుల కొండగా పేరు పొందింది. ఆ కొండలో ఎన్నో అద్భుత గుహలు, వున్నాయి. చల్లని సెలయేళ్లతో, కోనేర్లతో పచ్చని పండ్లచెట్లతో అలరారుతున్న వాతావరణంతో ఆహ్లాదంగా వుంటుంది ఆ కొండ. అందువల్లే ఆ కొండ తపస్సు చేసుకొనే యోగులకు, సాధకులకు ఆలవాలమైంది. ఆ కొండలో ఎందరో సిద్ధులు, పరమయోగులు, అవధూతలు ఉపాసకులు సంచరించేవారు. వీళ్ళందరికి దర్శన భాగ్యం కల్గించే దేవతా సమూహాలతో, శివలింగాలు వున్న గుళ్లతో ఆ కొండ మరింత ఆధ్యాత్మిక చైతన్యంతో ప్రకాశిస్తుంటుంది. అందువల్లే ఆ పర్వత శిఖరం 'యోగులకొండ'గా 'వేముల కొండ' గా పిలువబడుతుండేది.

ఒకానొక సందర్భంలో 'సిద్ధులయ్య' అనే సాధకుడు తన తపస్సాధన కోసం దేశమంతటా తిరుగుతూ ఈ ప్రాంతానికి వచ్చాడు. ఒకవైపు సప్తగిరుల సానువులు! మరోవైపు సువర్ణముఖీ తీరంలో వెలసివున్న దక్షిణకాశి, భూకైలాసం శ్రీకాళహస్తీశ్వర క్షేత్రం! అంతేకాదు. చుట్టూరా మునుల తపోభూములు! అక్కడికి దగర్లో శ్రీ శుకమహర్షి ఆశ్రమం, పరాశర మహర్షి ఆశ్రమాలు–ఇలా చుట్టూరా వీటిన్నటి మధ్యలో ప్రశాంతంగా కాంతివంతంగా దర్శనమిచ్చింది ఈ పర్వతం .

ఆ కొండపై సాధనకు ఉపక్రమించిన సిద్ధయ్యకు కొంతకాలనికి బాగా ధ్యానం గురి కుదిరింది. తదేకంగా శ్రీనివాసుని గూర్చి తీవ్రమైన తపస్సు చేశాడు. అతని అదృష్టం బాగున్నట్లుంది! ఆ కొండకు దగ్గర్లోనే వున్న సువర్ణముఖీ, కల్యాణీనదుల సంగమక్షేత్రంలోని అగస్త్యమహర్షి ఆశ్రమం కేంద్రంగా చుట్టురావున్న వనాల్లో నూతనకల్యాణ దంపతులైన శ్రీపద్మావతీ శ్రీనివాసులు సరససల్లాపాలతో సంతోషసంబరాలతో విహరిస్తున్న సమయం అది.



అంతే! ఆ సమయంలో పర్వతాగ్రాన సిద్ధయ్య చేస్తున్న తపస్సుకు మెచ్చిన కల్యాణవేంకటేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. కన్నులారా దర్శనమిచ్చిన స్వామివారిని ఆ యోగి అనేకవిధాలుగా కీర్తించాడు. ఆయన స్తుతులకు ప్రసన్నుడైన శ్రీనివాసుడు అభయమిస్తూ వరాన్ని కోరుకొమ్మని చెప్పాడు.

స్వామీ! కేవలం నీ దర్శనం కోసమే తపస్సు చేశాను. నాకు ఎలాంటి కోరికలు లేవు. అయినా ఈ పర్వతమూలంలో, అభయముద్రతో ప్రసన్నుడవై నాకు దర్శనమిచ్చిన రీతిలోనే వెలసివుంటూ భక్తులను అనుగ్రహించ వలసిందని అభ్యర్థించాడు. 'తథాస్తు! అన్నాడు శ్రీనివాసుడు.

ఆనాటి నుంచి యోగులకొండకు ఆనుకొని క్రింది భాగంలో శ్రీనివాసుడు శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామిగా, అభయ కటిహస్త ముద్రలతో, శంఖచక్రాలను ధరించి చతుర్భుజాలతో, వక్షఃస్థలం మీది శ్రీవత్సచిహ్నంతో నిండుగా దండిగా దర్శనమిస్తూ, మెండుగా వరాలను గుప్పిస్తున్నాడు.

అంతేకాదు ఆ నాడు పరమయోగి సిద్ధయ్యవల్ల వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరుడు, భక్తుల పాలిటి కల్పతరువుగా, పిలిస్తే పలికే ప్రత్యక్ష దైవంగా ఎవరు ఏది కోరినా ప్రసన్నుడై వారి కోరికలన్నీ తీరుస్తున్నాడు.

మరోవిశేషం! ఏమంటే...

ఈ క్షేత్రంలో శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామికి ఇష్టమైన శనివారాల్లో ప్రదక్షిణలు చేసినవారి భాగ్యమే మహాభాగ్యం! అలా నియమంగా ప్రదక్షిణలు చేసినవారు ఏది కోరుకున్నా దానిని తప్పక ప్రసన్నంగా తీరుస్తాడట స్వామి! అందులోను శ్రవణ నక్షత్రం కలిసి వచ్చిన శనివారాలైతే మరింత శ్రేష్ఠం. అందువల్లే శనివారంనాడు భక్తులతో ఈ క్షేత్రం కిటకిటలాడుతుంది.

యోగి సిద్ధులయ్య లేదా సిద్ధయ్యవల్ల శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వెలసిన ఈ ప్రాంతానికి "అప్పలాయగుంట" అనే పేరు ఏర్పడింది. ఈ పేరు ఏర్పడడానికి అనేక జనశ్రుతులు వినవస్తున్నాయి.

## వింత వింత జనశ్రుతులు

### అప్పులయ్య కథ

అప్పులయ్య అనే యాత్రికుడు తిరుమలకు వెళుతూ, దారిలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారిని దర్శనం చేసుకున్నాడు. తదుపరి అక్కడే దర్శనానంతరం ఒక చెట్టుకింద కొంతసేపు విశ్రమించినాడు. ప్రయాణ బడలికతో అలసిన అతనికి బాగా నిద్రపట్టింది ఆ తర్వాత నిద్ర లేచి, నిర్మానుష్యంగా వున్న ఆ ప్రాంతాన్ని విడిచి, తిరుమలయాత్రను వడి వడిగా సాగించినాడు. చాల దూరం పోయిన తర్వాత అప్పులయ్యకు అప్పుడు జ్ఞాపకం వచ్చింది. తాను పడుకొన్నచోటే ధనం సంచీని మరిచి వచ్చానని.

తెగ బాధపడ్డాడు. అయ్యో! పుణ్యానికి వస్తే, పాపం ఎదురయ్యిందే! నా ధనం నాకు దొరుకుతుందా? నేను తిరుమల యాత్ర చెయ్యగలనా? అని పరి పరి విధాలుగా చింతిస్తూ చేతు లెత్తి ఇలా ప్రార్థించాడు.

‘స్వామీ! ఏడుకొండలవాడా! ఆ కొండపైన ఏడుకొండలవాడిగా, ఈ యోగులకొండ క్రింద ప్రసన్న వేంకటాచలపతిగా నీవే వెలసివున్నావు కదా! స్వామీ! నా యందు ప్రసన్నుడవు కమ్ము. నా ధనం నాకు మళ్ళీ దొరికేట్లు చెయ్యి స్వామీ! నీ సన్నిధిలో. నీటి యెద్దడి తీరేట్టుగా గుంటను తవ్విస్తాను అని మొక్కుకున్నాడు. తాను నిద్రించిన స్థలానికి పరుగు పరుగున వచ్చాడు. ఆశ్చర్యం! తన ధనం మూట ఏ మాత్రం చెక్కు చెదరకుండా దొరికింది!

స్వామీ! నీవు నిజంగా ప్రసన్న వేంకటాచలపతివి నీవే స్వామీ! అంటూ దర్శనం చేసుకొని ఆ స్వామిసన్నిధిలో ఒక నీటిగుంటను తవ్వించినాడు. ఆ గుంట అప్పులయ్య తవ్వించిన గుంట కనుక ఆనాటినుంచి ఆ చెరువు “అప్పులయ్యగుంట”గా పిలువబడుతూ తర్వాత తర్వాత “అప్పలాయగుంట”గా



మారిందని ప్రజల కథనం. ఆ గుంట పేరే తర్వాతి దినాల్లో ఆ ఊరికీ స్థిరమైపోయింది.

ఇదిగాక, మరో అద్భుతమైన కథనం వినండిమరి! ఈ కథ ముమ్మాటికీ నిజమే అన్నట్లుగా అందంగా అమరినట్లుగా వినవస్తున్నది. అదేమిటంటే!

### అప్పులేని గుంట

పూర్వం ఆ గ్రామస్థులు నీటిఎద్దడితో బాధలు పడేవారు. అటు శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారి దర్శనార్థం వచ్చే యాత్రికులు, ఆ ఊరిప్రజలకు నీళ్ళతో చాల ఇబ్బందులు పడేవారు. ఆ బాధను శాశ్వతంగా తొలగించు కొనేందుకును ఆ గ్రామస్థులు అందరూ కలిసి ఒక చెరువును తవ్వించాలని తలపెట్టారు!

ఆ పనికి పూనుకొన్నప్పటినుంచి చివరిదాకా పని చేసే కూలివాండ్లకు ఏ రోజు కూలి ఆ రోజే ఇచ్చే నియమం పెట్టుకొన్నారు ఆ గ్రామ ప్రజలు. ఇలాగ ఎప్పటికప్పుడు, ఏనాటి కానాడు పనిచేసేవాండ్లకు ఏమాత్రం అప్పులేకుండా, అప్పు పెట్టకుండా కూలీని చెల్లిస్తూ నీటి గుంటను తవ్వించారు. ఈ గుంటపని చాలా రోజులు కొనసాగింది. ఎలాగైతే ఏమి? ఆ పల్లె ప్రజలు పెట్టుకొన్న నియమం ప్రకారమే, వాళ్ల పట్టుదలతో చక్కని మంచినీళ్లగుంట తయారయ్యింది. నీళ్ళతో పుష్కలంగా చెరువు నిండింది. ఆ ఊరిప్రజలు ప్రసన్న వేంకటపతికి అనేక విధాలుగా మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఆ వూరికి ఏ పేరు వుండిందో ఏమోకాని ‘అప్పులేని గుంట’ అని పేరు పెట్టుకున్న తమ చెరువుపేరే ఆ ఊరికీ సార్థకమయ్యింది. అందువల్ల ఆనాటి నుంచి అది “అప్పులేనిగుంట”గా పిలువబడింది. అది కాలక్రమంగా “అప్పులేని గుంట”గా పిలువబడుతూ

గ్రామస్థుల నోళ్లలో "అప్పలాయగుంట" గా మారిందన్న జనరంజకమైన వృత్తాంతం కమనీయంగా వినపడుతున్నది.

ఈ గాథే, ఈ రెండవ వృత్తాంతమే సత్యానికి కొంత దగ్గరగా ఉందని భావించవచ్చు. ఎందుచేతంటే!

ప్రాచీనకవుల రాతల్లో, రచనల్లో, శాసనాల్లో "అప్పులేని గుంట" పేరు సంస్కృతీకరింపబడి "అన్నృణ సరోవరం" అనే పేరుతో ప్రయోగింపబడింది.

ఋణం అంటే అప్పు. అన్నృణం అంటే అప్పు లేకపోవడం, పెట్టకపోవడం. అంతేగాక, ఆ నాటినుంచి ఇందులో స్నానమాడిన తర్వాత, శ్రీప్రసన్నవేంకటాచలపతిని దర్శిస్తే చాలట! తమ అప్పులన్నీ, ఋణబాధలన్నీ తీరేవట! అందువల్ల కూడ ఇది అప్పులను తీర్చే సరోవరం! అప్పులు లేకుండా చేసే గుంట! చివరికి అదే అప్పలాయగుంట! అయ్యింది.

## చారిత్రక కథనాలు

సుమారు వెయ్యేండ్లకు పైగా చారిత్రక ప్రసిద్ధి వున్న కార్వేటి నగర ప్రభువుల పాలనలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి క్షేత్రం అయిన అప్పలాయగుంట గ్రామం అన్నివిధాలుగా వైభవంతో విలసిల్లిందని శాసనాధారాలు స్పష్టం చేస్తున్నాయి.


అలనాటి నారాయణవరం ప్రభువులు ఆకాశరాజు, తొండమాను చక్రవర్తి, వసుదానుడు మున్నగు వారల పాలనలో వున్న ప్రాంతాలను తర్వాత తర్వాత వారి వారసులైన కార్వేటి నగర ప్రభువులు కూడా తమ పూర్వీకుల మాదిరే చక్కగా పరిపాలించడం విశేషం!



కార్వేటినగర ప్రభువుల రాజ్యానికి వాయవ్యంలోను, దక్షిణంలోను వ్యాపించిన ఉత్తరార్కాడుప్రాంతం, తూర్పున చెంగల్పట్టుజిల్లా, ఈశాన్య దిక్కులో శ్రీకాళహస్తి రాజ్యం ఎల్లలుగా వుండినాయి. అనగా తిరుమల, తిరుపతి, తిరుచానూరు నాగులాపురం, నారాయణవనం, తిరుత్తణి (తణికాచలం), షోలింగర్ అనబడే ఘటికాచలం మున్నగు పుణ్యక్షేత్రాల్లోని దేవాలయాలతోపాటు ఇతర క్షేత్రాలు, ఇంకా సుమారు 900 పైగా గ్రామాలు అన్నీ వీరి ఏలుబడిలో వుండినట్లు చరిత్ర చెబుతున్నది.

అంతమాత్రమేగాక ప్రధానంగా కార్వేటినగర రాజులు ఏదో మొక్కుబడిగా కాకుండా, ముఖ్యంగా, తిరుమల, తిరుపతి, తిరుచానూరు, అప్పలాయగుంట, క్షేత్రాల్లోని ఆలయ ఉత్సవాల్లో, ఊరేగింపుల్లో అత్యంత భక్తి ప్రపత్తులతో స్వయంగా పాల్గొనేవారు. కేవలం పాల్గొనడమేగాక ఆ యా ఆలయాలకు అనేక ఆభరణాలను, నగలను, నాణేలను ఉదారంగా కానుక పెట్టుకొన్న వితరణశీలురు కార్వేటినగర ప్రభువులు. వీళ్ల తిరుమలేశునికి ఒక నవరత్న కిరీటాన్ని, సూర్యకటారి అనబడే నందకఖడ్గాన్ని, అనేక రత్నాలు పొదిగిన దివ్యాలంకారాలను కూడ సమర్పించినట్లు కూడ తెలియవస్తున్నది.

కార్వేటినగర ప్రభువుల్లో కటారి సాళ్వమాకరాజ శ్రీ వెంకట పెరుమాళ్రాజు అత్యంత ప్రసిద్ధుడు. ఈయన వేంకటేశ్వరస్వామికి పరమభక్తుడు. అందులోను అప్పలాయగుంట శ్రీప్రసన్నవేంకటేశ్వరుడంటే ఈ రాజుకు అమిత భక్తి. అందువల్లే ఈ ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేయడమేగాక అప్పలాయగుంటకు చుట్టుపక్కల సాగులో వున్న వరిమడులను ఈ ఆలయానికి మాన్యాలుగా ఇనాములుగా ఇచ్చాడు. ఉత్సవాలను ఉత్సాహంగా నిర్వహింపజేసేవాడు. ఆ స్వామివారికి జరిగే ప్రధాన ఉత్సవాల్లో



వెంకటపెరుమాళ్రాజు
సమర్పించిన దీపపు స్తంభాలు

ఊరేగింపుల్లో స్వయంగా పాల్గొన్న భక్త శిఖామణి వెంకట పెరుమాళ్రాజు. అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటాచలపతికి 1750 ప్రాంతంలో కానుక పెట్టుకొన్న పెద్ద దీపపు స్తంభాలను నేటికీ ఇచ్చటి ఆలయంలో చూడవచ్చు. సుమారు 5 అడుగుల ఎత్తువున్న ఇత్తడి దీపపుసెమ్మెలపై వెంకట పెరుమాళ్రాజు లిఖింపజేసిన దానశాసనం కూడ మనం పరిశీలించవచ్చు.

**“శ్రీ అక్షయ సం॥ వైశాఖ శుద్ధ 15 అనృణసరోవర నగరాధీశ్వర శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి సన్నిధౌ, శ్రీ మహామండలేశ్వర కటారి సాళ్వమాకరాజు శ్రీ వెంకట పెరుమాళ్రాజు దేవమహారాజు సమర్పితాఖండ దీపికాస్తంభో విజయతేతరాం.”**

ఈ శాసనానికి ఎడమవైపున ఖడ్గం గుర్తు, ఆ ఖడ్గానికి ఇరువైపులా సూర్యచంద్రుల ముద్రలు, ఖడ్గం మొనక్రింద వరాహముద్ర చిత్రించ బడినాయి.

కార్వేటినగర రాజు వెంకట పెరుమాళ్రాజు కవి, పండితపోషకుడే గాక స్వయంగా కవీ, పండితుడు కూడ. ఈయన సాహితీసమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలమాదిరే తన ఆస్థానంలో కూడ అష్టదిగ్గజాలనే ఎనిమిది మంది కవులను పోషించినాడు. వారిలో **సారంగపాణి** ప్రసిద్ధి గొన్న వాగ్గేయకారుడు. ఈయన రచించి పాడిన మధురభక్తి పాటలు



**“సారంగపాణి పదాలు”** గా పేరుపొందినాయి. ఈ సారంగపాణి గానం చేసిన పదాల్లో, అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామికూడ చోటు చేసుకున్నాడు.



అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడు భక్తులపాలిటి ప్రసన్నుడైన దేవదేవుడుమాత్రమే కాదు. బృందావన గోపికలను మోహింప జేసిన కృష్ణునివలె, పరమపురుషుడైన ఈ వేంకటపతి తన చెంతకు చేరిన నాయికలను విరహతాపానికి గురిచేసిన శృంగారరాయడు కూడ!



## ఘంటారాగం-ఆదితాళం

పల్లవి: తటుకు తటుకు మని యదరీనె గూడె.
దిటువు లేదె నీ సాక్షిగా

అనుపల్లవి: కుటిలకుంతలి యన్నృణ సరోవర-
మట ప్రసన్న వేంకటశౌరి మొన్న
చిటికలో వలపించి పోయెనే
నెటుల సైతు దెలుపవె నా రొమ్మున



చరణం: నిలువనీయదు నిలిచిన చోట
నిమిష మొక్క యుగ మాయెనే
పలుక నీదు ప్రాణ సఖుల మీది
బాళి యెపుదు మరుపాయెనే
తలచి తలచి వేదనచే గుందితి-
తలవాకిట నిలిచి యెదురు చూచితి
లలన యాతనిపై రోసితి
చెలువరాయని బాసిన మొదలుగ ॥తటుకు॥

అన్నమేమో నా జిహ్వకు సుంత
హాయనేది లేదాయెనే
కన్నెరొ విరహాగ్నిచేత
కరగి మేను సగమాయెనే
అన్ని దైవముల వేడుకొంటి
అతని కైనవారిని శరణంటి
యెన్ని శకునములో జూడమంటి
యెమ్మెకాడిటకు రానందుకు ॥తటుకు॥

రతులు దేలించిన నా సామి-
రాక సమయ మిటు జేసెనే
అతివరో సరివారు నవ్వగ
అగడు నా తల వ్రాసెనే
పతిని విడచి నేనే వగ సైతు
పణతి యీ తొడవు లెచట వైతు
మితము మించి చిలుకతేజి రౌతు
మేలు వాడు వేంచేసేటంతలో

### ముఖారి–త్రిపుట

పల్లవి: అరుదు గాదట వేమె–యమ్మనే జెల్లనే
దతడిందు వచ్చినది.

అనుపల్లవి: సరసిముఖి అనృణ సరసీతటి నెలకొన్న
పరమాత్ము డైనట్టి ప్రసన్న వెంకటశౌరి ॥అరుదు॥

చరణం: దక్కితినని చెలులెందరో చుట్టు తిరగగ
వక్కతేప కడపైన తొక్కినాడటె యింక
యెక్కడి మోహమే యెపుడు నిన్నెరగడు
చుక్కవంటి ముత్యపు ముక్కర తీసుకొని॥అరుదు॥

.........................................

పై రెండుపాటల్లో సారంగపాణి తానే నాయిక! తానే మధురభక్తితో విరహంతో గానం చేసిన స్వామివారి ప్రియురాలు!!

### కాపి–చాపు

పల్లవి: నను గురుతు దెలియ నిచ్చున యీ భాగ్యముమీద
నాతివల్ల నేరమా–యేమె

అనుపల్లవి: అనృణసరోవర– మనుకోగా వినలేదా!
ఘనవేణి ప్రసన్న వెంకటశౌరి నే గాదా! ॥నను॥

చరణం: సగము రేయిదాక సంధానాలంపించి
వగలాడి నీవు నా వద్దకి రాలేదో
ఇగురుబోణిరో యీ సుద్దెరుగకుండ నాడీ!
మగరాల కమ్మ లే మగడిచ్చెనే నీకు ॥నను॥

.......................................



సాక్షాత్తు అనృణ సరోవరంలోని అప్పలాయగుంట శ్రీప్రసన్నవేంకటేశ్వర స్వామివారే నాయకుడు. నాయికతో ఆడిన పాట ఇది. ఈ మూడుపాటలు సారంగపాణి వ్రాసిన మధురభక్తియుతమైన శృంగారపు పాటలు.

సారంగపాణి కాలాన్ని క్రీస్తుశకం 1750–1820 గా నిర్ణయించడమే గాక, ఈ వాగ్గేయకారుడు కార్వేటి నగర ప్రభువైన వెంకట పెరుమాళ్రాజు ఆస్థానంలో వుండినట్లు పరిశోధకులు భావిస్తున్నారు. సారంగపాణి తనను పోషించిన ప్రభువైన మాకరాజు మీద కూడ పదాలను చెప్పాడు.

## శంకరాభరణం–ఆదితాళం

**తేనెలూర మాటలాడకు– తెలిసె నీ నెనరు**
**మానినీ మనోహర! శ్రీ సాళువ–మాకరాజు కార్వేటి రాజేంద్రా!**

సారంగపాణి చేత కీర్తింపబడిన ఈ మాకరాజే, మాకరాజ వెంకట పెరుమాళ్రాజు, అని పైన పేర్కొన్న దీపపు సెమ్మెల మీది శాసనం స్పష్టం చేస్తున్నది.

అంతకు చాలపూర్వమే కార్వేటినగరంలోకూడ ఒక ప్రసన్న వేంకటాచలపతి ఆలయం వున్నట్లు తెలియవస్తున్నది.

ఋగ్వేది వేంకటాచలకవి చంపూరామాయణాన్ని రచించినాడు. ఈ గ్రంథాన్ని కార్వేటినగరరాజైన వెంకటపెరుమాళ్రాజుకు జ్యేష్ఠ భ్రాత అయిన కసవరాజునకు అంకితమిచ్చాడు. అందులో తాను 'శ్రీవేంకటేశ్వరాష్టకం' పేరుతో ఎనిమిది పద్యాలను రచించిడమేగాక అందులోని క్రింది పద్యాన్ని కసవరాజుకు విన్పించినట్లుగా ఋగ్వేది వేంకటాచలకవి తన చంపూ రామాయణకావ్యంలో పేర్కొన్నాడు.

శా॥ వేర్వేరన్ శివుడంచు విష్ణు వనుచున్
వెల్లంటి కావేరి రా-
జోర్వీనాథ కుమారుడౌ కసవరా-
జుత్సాహవృత్తిన్ ధరా-
గీర్వాణప్రకరంబు లెంచగను భ-
క్తిన్ సంప్రతిష్ఠించెగా
కార్వేటీశ! ప్రసన్న వేంకటరమా
కాంతా మనోవల్లభా !!

ఈ పద్యంవల్ల ఆ నాటికే కార్వేటినగరంలో ఒక ప్రసన్న వేంకటేశ్వరుడు ప్రతిష్ఠింపబడినట్లు స్పష్టమవుతున్నది. ఇది కార్వేటినగరానికి పశ్చిమ దిగ్భాగాన వుండినట్లు జన వ్యవహారం. నేడు ఈ ఆలయం కానరాదు.



కార్వేటినగరంలోని ఆ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారిని తరలించి అప్పలాయగుంటలో ప్రతిష్ఠించినట్లు కూడ వినవస్తున్న మాట! కాని ఇది పరిశోధించి తేల్చవలసిన అంశం.

అంతకు చాలపూర్వం అంటే 15వ శతాబ్దంలో తాళ్లపాక అన్నమాచార్యుల మనుమడైన చినతిరుమలాచార్యులు కూడ శ్రీప్రసన్న వేంకటేశ్వరుని ఇలా కీర్తిస్తూ ఒక శృంగార పదకవితను రచించాడు.



## నాదరామ క్రియ

వేవేలు చేతలవాడు వీడె వీడె
దేవుడు గదె ప్రసన్న తిరువెంగళప్పుడు !!

ఇద్దరు సతులు తన యిరువంకల గొలువ
గద్దెన చూపులవె కరగింపుచు
అద్దరిపాటు సేసి ఆయములు ముట్టీని
తిద్దిన గోళ్ల ప్రసన్న తిరువెంగళప్పుడు !!

కామినులు నలువంక కదిసి సేవలుచేయ
సామపు మాటలవె యాసలు చేయుచు
దోమటి చెనకులవె దుండగాల సేసీని
దీమసముతో ప్రసన్న తిరువెంగళప్పుడు !!

అలమేలుమంగ దన కాకు మడిచియ్యగాను
సొలపుల మాటలవె చొక్కింపుచు
నలువై శ్రీవేంకటనాథుడై కూడినవాడు
తెలిగన్నుల ప్రసన్న తిరువెంగళప్పుడు !!

– తాళ్ళపాక చినతిరుమలాచార్యులు

పై పాటలో అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరుడే కీర్తింపబడివుండ వచ్చును. ఎందుచేతంటే మొదటిచరణంలో పేర్కొన బడినట్లుగా ఆలయ ప్రాంగణంలో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి ఇరువైపుల నైరృతిలోను, వాయవ్యమూలలో అలమేలుమంగ, గోదాలక్ష్మీ సన్నిధులు (ఆలయాలు) వున్నాయి. అంతేకాదు. "ప్రసన్న వేంకటాచలపతి" పేరుతో ఇంకెక్కడా ఆలయాలు కానరావు.

ఈ అన్నుణసరోవర గ్రామవాస్తవ్యుడైన **గరిణిపూడి వెంకటసుబ్రహ్మణ్య కవి** అనే కవి శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామివారిని భక్తితో ఉపాసించినాడని ప్రసిద్ధి! ఈ కవి ఆదికవి వాల్మీకిమహర్షి ప్రణీతమైన సంస్కృత "బాలరామాయణం" కావ్యాన్ని తెలుగుపద్యకావ్యంగా రచించినాడు. ఇతని "బాలరామాయణం" పద్యకావ్యం అముద్రితం. భాష తెలుగే అయినా, "తమిళ గ్రంథలిపి" లో రాయబడిన తన పుస్తకాన్ని గరిణిపూడి వెంకటసుబ్రహ్మణ్యకవి, శ్రీప్రసన్న వేంకటేశ్వరునికి అంకిత మిచ్చినట్లు వినవస్తున్నది. ఈ కవికి సంబంధించిన అనేక విషయాలను పరిశీలించడంతోపాటు అముద్రితమైన **"బాలరామాయణం"** పద్యకావ్యాన్ని తి.తి.దేవస్థానంవారు ఉద్ధరింపజేసి ప్రచురిస్తే బాగుంటుంది.

ఇటీవలికాలం వరకు అంటే, ఆంగ్లేయులవారి కాలం వరకు కూడ ఈ అప్పలాయగుంటఆలయానికి కార్వేటినగరరాజులు ధర్మకర్తలుగా ఉంటూ ఆలయంలోని అర్చనలు, ఉత్సవాలను ఊరేగింపులను పర్యవేక్షించేవారు.

స్వాతంత్ర్యానంతరం ఉమ్మడి మద్రాసురాష్ట్రంలో కొంతకాలంపాటు ఈ ఆలయం 'తిరుత్తణి' ఆలయనిర్వహణలో వుండింది. భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత అనగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన పిదప ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ అధీనంలో ఈ ఆలయం పర్యవేక్షింపబడింది.

ఇలా పౌరాణికంగా, చారిత్రకంగా ప్రసిద్ధిని పొందివున్న అప్పలాయ గుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, కాలాంతరంలో అంగరంగవైభవంగా వైభోగంగా అర్చనాదులతో ఉత్సవాలతో ఊరేగింపులతో అలరారింది.



తమిళదేశం నుండి తిరుమలక్షేత్రానికి యాత్రకువచ్చే భక్తులకు షోళింగర్, తిరుత్తణి, కార్వేటినగరం, పూడి, అప్పలాయగుంట, తిరుచానూరు గ్రామాలద్వారా వున్న మార్గమే ప్రధాన యాత్రామార్గం.

పూర్వం భగవద్రామానుజులవారు, వేదాంతదేశికులవారు, ఆ తర్వాత ఎందరెందరో భక్తులు పూడి-అప్పలాయగుంట-తిరుచానూరు మార్గం ద్వారానే కాలినడకన యాత్రచేస్తూ తిరుమలకు వచ్చేవారు.

చెన్నైనుంచి కాశీయాత్ర చేసిన ఏనుగుల వీరాస్వామికూడా ఈ మార్గంనుండే పయనించి తిరుమలకు వచ్చాడు.

ఈ నాటికీ తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సమయంలో చెన్నై నగరంనుంచి గొడుగులను కాలినడకన తెచ్చే భక్తులందరికి కూడా పూడి- అప్పలాయగుంట-తిరుచానూరు మార్గమే ప్రధాన యాత్రామార్గం! అందువల్లే తమిళనాడు నుండి నడిచి వచ్చే యాత్రిక బృందాలకోసమే "అప్పలాయగుంట" దగ్గర్లోని కూడలివద్ద ఒక వసతి భవనాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మించింది. అందులో ఆ యాత్రికులకు అవసరమయ్యే స్నానపానాదుల ఏర్పాట్లతో పాటు అన్నదానం కూడ తి.తి.దేవస్థానం నిర్వహిస్తున్నది.

ఆ తర్వాత తర్వాత, అనేక చారిత్రక కారణాలవల్ల, ఆలయానికున్న ఆదాయ వనరులు పరహస్తం కావడంవల్ల, అటు పర్యవేక్షణతోపాటు ఇటు ఆదాయం కూడా సన్నగిల్లడంవల్ల కొంతకాలంపాటు స్తబ్ధంగా, అంతస్తేజంతో నివురుగప్పిన నిప్పువలె ఈ ఆలయం ధ్యానమగ్నుడైన మౌనివలె విరాజిల్లింది.

## తి.తి.దేవస్థానంలో విలీనం

చాల ఏండ్ల తర్వాత మళ్లీ ఇంచుమించుగా ఒకే సమయంలో అప్పలాయగుంట శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామివారి ఆలయం (1988 సెప్టెంబర్) తోపాటు, కార్వేటినగరంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం (1989 ఫిబ్రవరి) కూడ దేవాదాయశాఖ నుండి తిరుమల, తిరుపతి దేవస్థానంవారి ఆలయాల్లో విలీనం చేయబడినాయి.

ప్రత్యేకంగా 1988 సెప్టెంబరు 23వ తేదీ భాద్రపదశుక్ల ద్వాదశీ శుక్రవారంనాడు శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంవారు స్వీకరించే కార్యక్రమం అత్యంత వైభవంగా ఘనంగా జరిగింది.

పౌరాణికంగా, ఆధ్యాత్మికంగా తిరుమలక్షేత్రంతో ఎంతో అనుబంధమున్న అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరాలయం, 1988 నాటినుండి అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ జీర్ణోద్ధరణలతో, అర్చనాదులతో, ఉత్సవాలతో, ఊరేగింపులతో దిన దినాభివృద్ధి చెందుతూనే వుంది. మళ్లీ పూర్వపువైభవాన్ని సంతరింపజేయాలన్న ధ్యేయంతో తి.తి.దేవస్థానం ధర్మకర్తలమండలికూడ, విశేషప్రాధాన్యంతో గట్టి కృషి చేస్తోంది.

ఇలా తరతరాలుగా చరిత్రలో నిలదొక్కుకొని ఎప్పటికప్పుడు అభివృద్ధి పథంలో పయనిస్తున్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయం అదిగో! రండి! నడవండి!

ఆలయ విశేషాలను వరుసగా, మనకు తెలియవచ్చినంతవరకు తెలుసుకుంటూ ఆలయంలో ప్రవేశించి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారిని కన్నులారా దర్శించుకుందాం.




## శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం అప్పలాయగుంట

ఒకవైపు (దక్షిణ దిక్కున) ఆనుకొని వున్న ఎత్తైన యోగులకొండ! మరోవైపు ఈశాన్యదిక్కున అద్దంలామెరుస్తువున్న విశాలమైన నీటి గుంట– ఆ గుంట నిండుగా తామరతీగలు, వికసించిన పద్మాలతో, వాటిపైన విహరించే తుమ్మెదలతో, ఆ గుంట చుట్టురా పచ్చని పంట పొలాలూ.. ఇలా ఎటుచూచినా సుందరమైన దృశ్యంతో ఎదో అవ్యక్తమైన ఆధ్యాత్మికతను దివ్యమైన అనుభూతులను పంచుతున్న దివ్యప్రదేశంలో తూర్పుముఖంగా అలరారుతూ వున్న ఆలయం శ్రీప్రసన్న వేంకటేశ్వరాలయం!

## శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి సన్నిధి

శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుని ఆలయ మహారాజ గోపురానికి ఎదురుగా ఆలయం వెలుపల సుమారు వందగజాల దూరంలో ప్రాచీనమైన శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి సన్నిధి పశ్చిమాభిముఖంగా ఉంది. కేవలం చిన్న అంతరాళం, గర్భాలయం. ఇలా రెండు గదులతో నిర్మింపబడిన. ఈ చిన్న గుడిలోని గర్భాలయంలో నిలువెత్తు శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి శిలామూర్తి ప్రతిష్ఠింపబడివుంది. గర్భాలయంపైన ఏకకలశ గోపురం నిర్మింపబడింది. నమస్కారభంగిమలో సుమారు 6 అడుగులకుపైగా ఎత్తువున్న ప్రసన్నాంజనేయునికి ప్రతి ఆదివారం ఉదయం 7 గంటలకు పంచామృత స్నపన తిరుమంజనం జరుగుతుంది. ఈ ఆలయం ముందుభాగంలో ఇటీవల దేవస్థానం వారు ముఖమండపాన్ని నిర్మించారు. సర్వగ్రహబాధా నివారకుడుగా, కర్మరోగ వినాశకుడుగా, ఆరోగ్యప్రదాతగా పేరు ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి వారికి భక్తులు నిత్యమూ ప్రదక్షిణలు చేస్తుంటారు.



శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయ మహాద్వార రాజగోపురం – అప్పలాయగుంట



## పుష్కరిణి

శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారికీ, శ్రీ ప్రసన్నవేంకటేశ్వర ఆలయ మహారాజ గోపురానికి మధ్యభాగంలో ఇటీవల క్రొత్తగా చిన్న పుష్కరిణి నిర్మింప బడింది. ఈ చిన్న కోనేరులో శ్రీస్వామివారి బ్రహ్మోత్సవాల చివరిరోజున, అలాగే వైకుంఠ ఏకాదశి–ద్వాదశిరోజున జరిగే "చక్రస్నానం" నిర్వహింప బడుతుంది. ఈ కోనేరు నిర్మింపబడకముందు ఆలయంలోనే ఒక పెద్దగంగాళంలో "తొట్టితీర్థం"గా భావించి "చక్రస్నానం" నిర్వహింప బడేది. అంతకు చాలపూర్వం "అప్పలాయగుంట"లో 'చక్రస్నానం' నిర్వహింప బడేదని, ఆ చెరువుగట్టున 'నీరాళిమండపం' వుండేదని స్థానికుల కథనం.

## మహాద్వార రాజగోపురం

తూర్పుముఖంగా నిర్మించబడిన ఈ ఆలయం చుట్టూరా ఇటుకలతో కట్టిన విశాలమైన ప్రాకారం వుంది. మహాద్వార రాజగోపురం కట్టడానికి అనువుగా నిర్మించబడిన రాతిచట్టంలో మాత్రమే మొండిగా నిలిచిన ప్రవేశద్వారం వుండింది. 1988లో తి.తి.దేవస్థానం స్వీకరించిన ఈ ఆలయానికి రాజగోపురాన్ని నిర్మించింది. 3 అంతస్థులతో 5 చిన్న కలశాలతో విరాజిల్లుతున్న ఈ రాజగోపురాన్ని అనుసంధిస్తూ చుట్టూరా విశాలమైన ప్రాకారం నిర్మింపబడింది. ఈ రాజగోపురాన్ని దాటి లోనికి ప్రవేశిస్తే పది అడుగుల దూరంలో బలిపీఠం, ధ్వజస్తంభం దానిని ఆనుకొని పడమటి ముఖంగా వున్న గరుడమండపం శ్రీ ప్రసన్న వేంకటేశ్వరునికి అభిముఖంగా నిర్మింపబడివున్నాయి.

## బలిపీఠం-ధ్వజస్తంభం

బలిపీఠంపైన-మూడుపుటలా నివేదనల జరిగిన అనంతరం-శుద్ధాన్నం బలిగా సమర్పింపబడుతుంది. ఆలయాన్ని అంటి పెట్టుకొని వున్న భూతగణాలకు ఆహారంగా బలిపీఠంపై సమర్పింపబడుతుంది.

ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో నిర్వహింపబడే బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తూ ధ్వజస్తంభంపైన గరుడ కేతనం ఎగురవేయబడుతుంది.

ఈ బలిపీఠ-ధ్వజస్తంభాలను ఇటీవలే దేవస్థానం జీర్ణోద్ధరణలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసింది.

## వంటశాల

మొదటి ప్రాకారం దాటి లోపల ప్రవేశించిన వెంటనే ఆగ్నేయమూలన ఇటీవల ఉద్ధరింపబడిన వంటశాల వుంది. ఇక్కడ నిత్యం మూడుపూటలా జరిగే నివేదనలకు అవసరమైన అన్నప్రసాదాలు, పిండివంటలు తయారు చేయబడతాయి. ఈ వంటశాలలో తిరుమలలో వలెనే వకుళమాలిక విగ్రహం ఉంది.

## గరుడమందిరం

**శ్లో|| కుంకుమాంకితవర్ణాయ**
**కుందేందుధవళాయ చ**
**విష్ణువాహ నమస్తుభ్యం**
**పక్షిరాజాయ తే నమః**



ధ్వజస్తంభానికి ఆనుకొనివున్న గరుడమండపంలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరునికి అభిముఖంగా నమస్కారభంగిమలో, రెక్కలు విప్పార్చుకొన్న గరుత్మంతుని 3 అడుగుల ఎత్తు శిలావిగ్రహం. ప్రతిష్ఠింపబడివుంది. విగ్రహం చిన్నదైనా, శిల్పం మాత్రం తిరుమలలో వలెనే వుంది. ఈ మండపం పైన ఏక కలశ గోపురం నిర్మింపబడింది. ఈ గరుడునికి ప్రతి సోమవారం ఉదయం స్నపన తిరుమంజనం జరిగిన తర్వాత దధ్యోదనం, పులిహోర నివేదింపబడతాయి.

* * *

మొదటి ప్రాకారం దాటిన తర్వాత లోపల అసంపూర్తిగ నిలిచిపోయి నట్లువున్న మరోప్రాకారం ఆలయంచుట్టూరా వుంది. దీని ఎత్తు కేవలం రెండు అడుగులు మాత్రమే. పెద్దప్రాకారానికి ఈ చిన్నప్రాకారానికి మధ్యలో అరటిచెట్లు, బిల్వం, మామిడి మున్నగు చెట్లు పెంచబడినందువల్ల ఆలయం మరింత ఆహ్లాదంగా కనపడుతున్నది. ఈ రెండవ ప్రాకారంలోపల ప్రదక్షిణ ఆవరణలో స్వామివారి గర్భాలయానికి నైరృతిమూలలో శ్రీపద్మావతి అమ్మవారి సన్నిధి, వాయవ్యమూలలో శ్రీగోదాదేవి (ఆండాళ్) సన్నిధి, వున్నాయి.

## శ్రీ పద్మావతి అమ్మవారి సన్నిధి

**పద్మప్రియే పద్మిని పద్మహస్తే**
**పద్మాలయే పద్మదళాయతాక్షి !**
**విశ్వప్రియే విష్ణుమనోనుకూలే**
**త్వత్పాద పద్మం మయి సన్నిధత్స్వ.**

శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుని గర్భాలయానికి నైరృతి మూలలో తూర్పు ముఖంగా నిర్మింపబడిన శ్రీ పద్మావతిఅమ్మవారి సన్నిధి ఉంది. అంతరాళం గర్భాలయం- ఇలా రెండు భాగాలుగా నిర్మింపబడిన ఈ చిన్నగుడిలోని



**శ్రీ పద్మావతి అమ్మవారు (మూలమూర్తి)**
**అప్పలాయగుంట (1980 నాటి ఫోటో)**



గర్భాలయం మధ్యభాగాన చతుర్భుజి అయిన శ్రీ పద్మావతి అమ్మవారి శిలావిగ్రహం ప్రతిష్ఠింపబడివుంది. పై రెండు చేతుల్లో రెండు పద్మాలను ధరించి, క్రింది రెండు చేతులను అభయ, వరదముద్రలతో పద్మంలో కూర్చుని ప్రసన్నవదనంతో చిన్మయహాసంగా భక్తులకు దర్శనమిస్తున్న శ్రీపద్మావతి అమ్మవారి విగ్రహం తిరుచానూరులోని మూర్తి కంటె కొంచెంపెద్దదని చెప్పవచ్చు. ప్రతిరోజు మూడుపూటలా నివేదనలతోపాటు ప్రతి శుక్రవారం ఈ అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు ఘనంగా జరుగుతాయి. గర్భాలయం పైన ఏకకలశగోపురం నిర్మింపబడింది.

## శ్రీ గోదాదేవి సన్నిధి (ఆండాళ్)

శ్రీ స్వామివారి గర్భాలయానికి వాయవ్యమూలలో తూర్పుముఖంగా నిర్మింబడిన శ్రీ గోదాదేవిఅమ్మవారి సన్నిధి వుంది. అంతరాళం, గర్భాలయం– ఇలా రెండు భాగాలుగా వున్న ఈ చిన్నగుడిలోని గర్భాలయం మధ్యభాగంలో నిలుచున్న గోదాదేవి శిలావిగ్రహం ప్రతిష్ఠింపబడింది. సుమారు 5 అడుగుల ఎత్తుతో ప్రసన్నంగా దర్శనమిస్తున్న శ్రీగోదాదేవికి ప్రతిరోజు మూడుపూటలా నివేదనలతో పాటు, ప్రతి శుక్రవారం అభిషేకాదులు అర్చనలు ఘనంగా జరుపబడుతాయి. **శ్రీ ఆండాళ్ తిరువడిగళే శరణం**

* * *

ప్రాకారాలమధ్య గరుడాళ్వార్ సన్నిధికి ఎదురుగా ప్రధాన ఆలయం వుంది. ఇది ముఖమండపం, అంతరాళం, గర్భాలయం అని మూడుభాగాలుగా నిర్మింపబడింది.

## ముఖమండపం

సుమారు 30 అడుగుల చతురస్రాకార ముఖమండపంలో 16 రాతిస్తంభాలున్నాయి. ఈ ముఖమండపం మధ్యలో మూలవరులకు ఎదురుగా నాలుగుస్తంభాలమధ్య చతురస్రాకారపు వేదిక నాలుగు అంగుళాల ఎత్తుతో అమర్చబడివుంది. ఈ వేదికమీద ఉత్సవమూర్తులకొలువు, తిరుమంజనం నిర్వహింపబడతాయి. ఈ మండపంలోనే ఉత్తరంవారకు వున్న గోడకు ఆనుకొనివున్న వేదికపై ఆళ్వారుల విగ్రహాలతోపాటు, శ్రీరామానుజుల విష్వక్సేనులవారి శిలామూర్తులు ప్రతిష్ఠించబడినాయి. ఈ శిలావిగ్రహాలతో పాటు తిరుమంగైఆళ్వారు, మరియు విష్వక్సేనులవారి పంచలోహమూర్తులు కూడ వున్నాయి. ప్రతి ఏకాదశినాడు ఈ ఆళ్వారుల విగ్రహాలన్నింటికి ఏకాంతంగా అభిషేకం జరుగుతుంది.

## ద్వారపాలకులు

ముఖమండపం దాటి లోనికి వెళ్లితే ఉండేదే అంతరాళం. అయితే ముఖమండపంలోనే అంతరాళానికి ఇరువైపులా కాపలాకాస్తున్న జయ విజయుల నిలువెత్తు శిలామూర్తులు ప్రతిష్ఠించబడినాయి.

## అంతరాళం

సుమారు 6×6 అడుగుల కొలతలువున్న అంతరాళంలో దక్షిణం వారకు వేదికపై ఉత్తరాభిముఖంగా శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులు వేంచేయబడివున్నాయి.



## గర్భాలయం

అంతరాళం కంటె ఒక అడుగు ఎత్తులో నిర్మింపబడిన గర్భాలయం మధ్యలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి శిలావిగ్రహం ప్రతిష్ఠింపబడింది. శ్రీస్వామి ఉత్సవమూర్తులు కూడ వున్నాయి. ఈ విగ్రహం ఎత్తు సుమారు 7 అడుగులు ఉంటుంది.

## శ్రీవారి మూలమూర్తి

**హైమోర్ధ్వపుండ్రమజహన్మకుటం సునాసం**
**మందస్మితం మకరకుండలచారుగండమ్**
**బింబాధరం బహులదీర్ఘకృపాకటాక్షం**
**శ్రీవేంకటేశముఖమాత్మని సన్నిధత్తామ్**

తిరుమలలో వలెనే స్వామి చతుర్భుజుడై శంఖచక్రాలు ధరించి కటిహస్తంతో విరాజిల్లుతున్నాడు. తిరుమలస్వామి వరదహస్తుడై దర్శనమిస్తుండగా, అప్పలాయగుంటలో స్వామి అభయముద్రతో ప్రసన్నుడై చిన్మయహాసంతో దర్శనమిస్తున్నాడు. తిరుమల శ్రీవారి హృదయం మీద శ్రీమహాలక్ష్మి అమ్మవారి ద్విభుజమూర్తి "వ్యూహాలక్ష్మి"గా కొలువైవుండగా, అప్పలాయగుంట స్వామివారి హృదయంలో శ్రీమహాలక్ష్మి త్రికోణాకారంలో వున్న "శ్రీవత్స" చిహ్నరూపంలో దర్శనమిస్తున్నది.

**శ్రీవత్సవక్షసం శ్రీశం**
**శ్రీలోలం శ్రీకరగ్రహమ్**
**శ్రీమంతం శ్రీనిధిం శ్రీఢ్యం**
**శ్రీనివాసం భజేఽనిశమ్**



**శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారు (మూలమూర్తి)**
**అప్పలాయగుంట (1980 నాటి ఫోటో)**



తిరుమలక్షేత్రంలో వలెనే అప్పలాయగుంట ఆలయంలో వైఖానసాగమ శాస్త్రం ప్రకారంగా అన్ని ఉత్సవాలు, అర్చనాదులు జరుపబడుతున్నాయి.

తిరుమల, తిరుపతి ఆలయాలమాదిరే అప్పలాయగుంట గర్భాలయం మీద ఏక కలశ గోపురం నిర్మింపబడింది. ముఖమండపం, అంతరాళం, గర్భాలయం–ఈ మూడు ఒక అడుగు ఎత్తువున్న రాతి అధిష్ఠానంపై నిర్మింపబడినాయి.

**"నా మనంబునందు నీవు**
**నన్నుఁబాయకుండఁగా**
**నీ మహత్వ మే నెఱుంగ**
**నేర కజ్ఞుఁడై భ్రమన్**
**భూమిలోనఁ బుట్టి పుట్టి**
**పోయి పోయి చూచితిన్**
**స్వామి నిన్నుఁ జూపవే**
**ప్రసన్నవేంకటేశ్వరా"**

– శ్రీ.వేం.లఘుకృతులు పు.141. ప.26)

## ఉత్సవమూర్తులు

ఈ గర్భాలయంలో మూలమూర్తితోపాటు శ్రీదేవీ భూదేవీ సమేతంగా శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులు, స్నపనమూర్తుల పంచలోహ విగ్రహాలు, భోగశ్రీనివాసుని విగ్రహం, చక్రత్తాళ్వార్, విష్వక్సేనుల వారి పంచలోహ విగ్రహాలు చోటు చేసుకున్నాయి.

ఈ ప్రధానాలయానికి– ఎదురుగా వున్న శ్రీప్రసన్నాంజనేయస్వామివారి ఆలయానికి మధ్యభాగంలో దక్షిణం వారకు వాహనంమండపం వుండినట్లుగా



తెలియవస్తున్నది. ఈ మండపం నామరూపాలు లేకుండా పూర్తిగా శిధిలంకాగా, ప్రస్తుతం అదేచోట వాహనమండపం నిర్మింపబడుతుంది.

ఎంతో ప్రాచీనతను, సంతరించుకొని ఎన్నో ఉత్సవాలతో, వైభవంగా అలరారిన ఈ ఆలయం, కాలాంతరంలో ఎన్నో ఒడిదుడుకులకులోనై శిథిలావస్థకు చేరుకున్న దశలో తి.తి.దేవస్థానం అధీనంలోకి వచ్చింది. తిరిగి పునర్వైభవాన్ని సంతరింపజేయాలన్న సంకల్పంతో దేవస్థానంవారు అనేక విధాలుగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడకి వచ్చే భక్తులకు అనేక సౌకర్యాలు కూడ కల్పిస్తున్నారు.

ఈ ఆలయంలో ప్రస్తుతం జరుగుతున్న లేదా నిర్వహింపబడుతున్న అర్చనాదుల వివరాలను ఆలయ ఉత్సవవిశేషాలను తెలుసుకుందాం.



## ఉత్సవాలు

శ్రీప్రసన్నవేంకటేశ్వరునికి జరిగే ఉత్సవాలను 1) నిత్యోత్సవాలు, 2) వారోత్సవాలు, 3) పక్షోత్సవాలు, 4) మాసోత్సవాలు, 5) వార్షికోత్సవాలు అనే ఐదు భాగాలుగా పరిశీలించవచ్చు.

## 1. నిత్యోత్సవాలు

ప్రతిరోజు విధిగా జరిగే సేవలే నిత్యోత్సవాలు.

ప్రతిరోజు ఉదయం 5 గం॥లకు కౌసల్యాసుప్రజారామ! అంటూ సుప్రభాత పఠనంతో ఆలయం వాకిళ్ళు తెరవబడతవి. ఆ తర్వాత 'తోమాలసేవ' అనబడే పుష్పాలంకరణ మూలమూర్తితో పాటు, ఆలయంలోని అన్ని ఉత్సవమూర్తులకు జరుగుతుంది.

ఆ తర్వాత 'కొలువు'. 'కొలువు' లో శ్రీస్వామివారికి ఆనాటి తిథి వార నక్షత్ర కరణ యోగం ఇత్యాదులను తెలియజేస్తూ పంచాంగ శ్రవణం జరుగుతుంది. దీన్నే "కొలువు" అంటారు.

ఆ తర్వాత అర్చన. ప్రతిరోజు ఉదయం శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి వారికి శ్రీవేంకటేశ్వరఅష్టోత్తరశతనామార్చన, హోమం జరుగుతుంది. ఆ తర్వాత నివేదన.

ఉదయం 7 గం॥లకు మరియు 10-11 గం॥ల మధ్య, సాయంత్రం 5 1/2 - 6 గం॥లకు ఇలా మూడుమార్లు నివేదన జరిగిన తర్వాత బలి సమర్పింపబడుతుంది.

ఉదయం, మధ్యాహ్నం దధ్యోదనం, పులిహోర నివేదింపబడగా సాయంత్రం 'ముళహోర' నివేదన చేస్తారు.

ప్రతిరోజు రాత్రి 8 గం॥లకు ఏకాంతసేవ అనబడే పవళింపుసేవ జరుగుతుంది. పాలు, పంచకజ్జాయం నివేదింపబడుతుంది. తర్వాత ఆలయం తలుపులు మూసివేస్తారు.



గ్రామోత్సవం (ఊరేగింపు)

## 2. వారోత్సవాలు

వారానికి ఒకరోజు విధిగా జరిగే సేవలు ఇవి.

ఆదివారం : ప్రతి ఆదివారం ఉదయం 8 గం॥లకు ఆలయానికి ఎదురుగావున్న శ్రీప్రసన్న ఆంజనేయస్వామివారికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీరు పసుపు, చందనంతో అభిషేకం జరుగుతుంది. పిదప దధ్యోదనం, పులిహోర నివేదింప బడుతవి. భక్తులు ప్రత్యక్షంగా దర్శించవచ్చు.



సోమవారం : ప్రతి సోమవారం ఉదయం ఆలయంలోని గరుడ మందిరంలో స్నపన తిరుమంజనం ఆంజనేయునికి జరిగినట్లుగానే జరుగుతుంది. పెరుగన్నం, పులిహోర నివేదింపబడతాయి.

శుక్రవారం : ప్రతి శుక్రవారం ఉదయం 7 గం॥లకు శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారి మూలమూర్తులతో పాటు, అన్ని ఉత్సవమూర్తులకు, శ్రీపద్మావతి అమ్మవారు, శ్రీగోదాదేవి, మూలమూర్తులకు అభిషేకాలు జరుగుతవి. శ్రీస్వామివారికి జరిగే ఆర్జిత అభిషేకోత్సవంలో నిర్ణీత రుసుమును చెల్లించిన భక్తులు పాల్గొని దర్శించవచ్చు. అభిషేక సమయంలో చక్కెర పొంగలి, పులిహోర నివేదన చేస్తారు.

శనివారం : ప్రతి శనివారం సాయంత్రం 5 గం॥లకు శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి ఊంజల్‌సేవ జరిగిన తర్వాత పల్లకిలో గ్రామోత్సవం జరుగుతుంది.

## 3. పక్షోత్సవాలు

ప్రతి పక్షానికి జరిగే సేవలు.

ఈ ఆలయంలో ప్రతి ఏకాదశినాడు ఆలయంలోవున్న ఆళ్వారులకు, రామానుజులవారికి ఏకాంతంగా అభిషేకం జరిగిన తర్వాత వడపప్పు, పానకం నివేదింపబడతాయి.

## 4. మాసోత్సవాలు

నెలకు ఒక్కమారు జరిగే ఉత్సవాలు.

ప్రతినెలా శ్రవణ నక్షత్రంనాడు ఏకాంతంగా ఉత్సవమూర్తులకు అభిషేకం జరిగిన తర్వాత కల్యాణోత్సవం ప్రారంభమౌతుంది.



శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

## కల్యాణోత్సవం

తర్వాత ఉదయం 10 గం॥లకు శ్రీదేవీ భూదేవీ సమేతంగా శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి ఆర్జిత కల్యాణోత్సవం జరుగుతుంది. నిర్ణీత రుసుమును చెల్లించిన గృహస్థు కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. వీరికి ఒక రవిక గుడ్డ, ఒక ఉత్తరీయం ప్రసాదంగా ఇస్తారు. కల్యాణోత్సవంలో శ్రీవారికి అప్పాలు, చక్కెర పొంగలి, పులిహోర నివేదింపబడతాయి.



## 5. వార్షికోత్సవాలు

సంవత్సరానికి ఒకమారు జరిగే సేవలు, ఉత్సవాలు.

### ఉగాది ఆస్థానం

ఈ ఆలయంలో ఉగాదినాడు, ఆస్థానం జరిగి పంచాంగ శ్రవణం జరుగుతుంది. సంవత్సర ఫలితాలు స్వామివారికి విన్పించబడతాయి.

### ఆణివార ఆస్థానం

అలాగే ప్రతి సంవత్సరం జులై 16 వ తేదీన ఆణివార ఆస్థానం జరుగుతుంది.

### దీపావళి ఆస్థానం

దీపావళినాడు దీపావళి ఆస్థానం జరుగుతుంది.

### బ్రహ్మోత్సవాలు

ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో పదినాళ్ళపాటు శ్రీప్రసన్నవేంకటాచలపతికి బ్రహ్మోత్సవాలు జరుపబడతవి.

శ్రవణ నక్షత్రం నాటికి చక్రస్నానం పూర్తయేట్లుగా 9 రోజులు ముందు నుంచి బ్రహ్మోత్సవాలను నిర్వహించడం జరుగుతుంది.

బ్రహ్మోత్సవాలకు వారం రోజులు ముందుగా "కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం" నిర్మహింపబడుతుంది. శ్రీస్వామివారి గర్భాలయంతో సహా మొత్తం ఆలయాన్ని శుభ్రంచేసి, బ్రహ్మోత్సవాలకు అలంకరిస్తారు. దాన్నే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అంటారు.



శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి వారి గరుడోత్సవం



శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి వారి హనుమంత వాహనం



జ్యేష్ఠమాసంలో శ్రవణ నక్షత్రం నాటికి పదిరోజుల ముందు విష్వక్సేనుల వారి ఆధ్వర్యంలో మృత్సంగ్రహణయాత్ర జరిగి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. ఆ మరునాడు ధ్వజారోహణం జరుగుతుంది. ధ్వజారోహణం జరిగిన రాత్రి పెద్దశేషవాహనం, రెండవనాడు ఉదయం చిన్నశేషవాహనం – రాత్రి హంసవాహనం, మూడవనాడు ఉదయం సింహవాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం, నాల్గవనాడు ఉదయం కల్పవృక్షవాహనం, ఆ సాయంత్రం ఆర్జిత కల్యాణోత్సవం, ఆ రాత్రి సర్వభూపాల వాహనం, ఐదవనాటి ఉదయం మోహినీ అవతారం, ఆ రాత్రి గరుడోత్సవం, ఆరవనాడు ఉదయం హనుమంతవాహనం, ఆ సాయంత్రం వసంతోత్సవం, ఆ రాత్రి గజవాహనం, ఏడవనాటి ఉదయం సూర్యప్రభ, ఆ రాత్రి చంద్రప్రభ వాహనం, ఎనిమిదవనాడు ఉదయం రథోత్సవం, ఆ రాత్రి అశ్వవాహనం, తొమ్మిదవనాటి ఉదయం చక్రస్నానం, ఆ రాత్రి ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు సుసంపన్నం అవుతాయి.

బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు సాయంత్రం ఊంజల్‌సేవ జరుగుతుంది. ఆ తర్వాతనే రాత్రి వాహనోత్సవం నిర్వహింపబడుతుంది.

ఆ తర్వాత ఆ రాత్రి ద్వాదశారాధన పేరుతో ప్రత్యేక నివేదనలు ఏకాంతంగా జరుగుతాయి. దీనితో బ్రహ్మోత్సవాలు పూర్తి అవుతాయి.



**శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవం**

## పవిత్రోత్సవాలు

ఆ తర్వాత భాద్రపదమాసంలో బహుళద్వాదశినాడు శ్రీప్రసన్నవేంకటాచలపతికి ఒక్కనాడు మాత్రమే పవిత్రోత్సవం జరుగుతుంది. ఆ తర్వాత గ్రామోత్సవం జరుగుతుంది.

ఆలయ అర్చనల్లోను లేదా సిబ్బందివల్ల లేదా యాత్రికులవల్ల తెలిసీ తెలియక జరిగిన పొరపాట్లవల్ల కలిగే దోషాలను పోగొట్టి ఆలయాన్ని పవిత్రీకరించే ఉత్సవమే పవిత్రోత్సవం.



శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారి చక్రస్నానం

## వైకుంఠ ఏకాదశి - చక్రస్నానం

ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి - ద్వాదశినాటి ఉదయం శ్రీస్వామివారికి ఊరేగింపు, చక్రస్నానం జరుగుతుంది. ఆలయగోపురానికి ఎదురుగా కొత్తగా నిర్మించిన కోనేరులో చక్రస్నానం జరుగుతుంది.

## సంక్రాంతి

సంక్రాంతి పండుగనాడు శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామికి ఉభయ దేవేరులతో పాటు తిరుచ్చిలో గ్రామోత్సవం జరుగుతుంది.



సూర్యప్రభ వాహనం

## రథసప్తమి

మాఘమాసంలో -

'రథసప్తమి' పండుగనాడు శ్రీదేవీ భూదేవీ సమేతంగా శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారికి ఊరేగింపు జరుగుతుంది.

ఇలా ఏడాది పొడవునా ఎన్నో ఉత్సవాలను ఉద్ధరించి నిర్వహించి, ఈ ఆలయాన్ని ఉభివృద్ధి చేయాలన్న సంకల్పంతో దేవస్థానంవారు, విశేషకృషితో 2006 ఏప్రిల్ 30 తేదీన వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం జరిగిన ఆలయ మహాసంప్రోక్షణ కార్యక్రమంతో అప్పలాయగుంటలోని శ్రీప్రసన్నవేంకటేశ్వర స్వామి ఆలయం పూర్వ వైభవాన్ని సంతరించుకోగలదని ఆ స్వామి భక్తులపాలిట ప్రసన్నంగా ఉంటూ భక్తవత్సలుడుగా, వరాలరాయుడిగా అందరినీ అనుగ్రహించాలనీ మనసారా ప్రార్థించుదాం.

# సమర్పణ



**శ్రవణములు నీ కథల్ విన**
**నవనీధర! చేయు మెపుడు నార్తివిహరణా !**
**భవమోచన మొనరింపను**
**వివిధాయుధ రమ్ము సుగుణ వేంకటరమణా !!**

ఒకచోట "సప్తగిరీశ్వరుడు" గా, మరొకచోట "కల్యాణవేంకటేశ్వరుడు" గా, కోరిన "వరాలరాయడు" గా ప్రసన్నంగా దర్శనమిస్తూ, అప్పలాయగుంట క్షేత్రంలో కొలువైవున్న "శ్రీప్రసన్నవేంకటేశ్వర స్వామి" వారి పాదపద్మ సన్నిధికి ఈ పుస్తక సుమాన్ని భక్తితో సమర్పణ చేసుకుందాం!

**శ్రియఃకాంతాయ కల్యాణనిధయే నిధయేఽర్థినామ్**
**శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్**

**ఓం నమో వేంకటేశాయ**